# పశ్చాత్తాపము

శ్రీ చేబోలు వెంకట్రావు

★

మా ఉద్యానవనంలోని శిలావేదికపై కూర్చున్నాను. వెన్నెలరాత్రి. మందమలయానిలం వీస్తుంది. నీటిలో చిన్న చిన్న తరంగాలు బయలుదేరి చంద్రబింబాన్ని చలింపజేసాయి. దుఃఖముచేత నామనస్సు చలించిపోయింది.

తన దుఃఖాన్ని యితరులకు వినిపించడంచేత హృదయం శాంతి పొందుతుందని విన్నాను. అందుకనే ఈ రోజున నా దుఃఖ చరిత్రను వినిపించి హృదయశాంతికై యెదురుచూస్తున్నాను. కేవలము తారాచంద్రులకే కాదు - వినేవారందరికి-నా యవ్వనావస్థలోని నా అనుభవము సంభవించిన ఘటన.

ఇప్పుడు నేను ధనికుణ్ణి! సమర్థుణ్ణి!! ఉజ్వలకాంతితో వెలుగుతూఉన్న రత్నాన్ని!!! ఈ నాడు ప్రజలు నన్ను గురించి "సుధాకరుడు, దేశంలోను, సంఘంలోను ఉత్కృష్టుడు. ఇంకా వర్ధిల్లాలి" అంటున్నారు.

ఇప్పుడు నాదగ్గర ధనముంది. ప్రపంచం నన్ను ఆదరిస్తుంది. యెంచేతంటే నేను ప్రపంచాన్ని లక్ష్యపెట్టను గనుక. సంఘానికి నేను ఎప్పుడు జంకేనో, అప్పుడే నిరాశానందకూపంలో త్రోసివేయబడ్డాను.

★

నా బాల్యము చాల ప్రశాంతంగా నడిచిపోయింది. కాని నా యవ్వనంలో సంఘముయొక్క దుర్భర కాఠిన్యతవల్ల సౌరభ్యయుతమై సుఖదాయకమైన నా జీవితం మ్రగ్గిపోయింది.

నా చిన్నతనంలో అంత సౌరభము నొసగింది, సుఖము నొసగినది సర్వగుణ సంపన్ని, రూపవిలాసిని; స్త్రీ-పేరు 'రజని' మే మిద్దరం ఇరుగు పొరుగు ఇంటివారం. నిత్యం ఆమెతో కాలక్షేపం చేస్తుండేవాణ్ణి. పెద్దవాళ్లు కూడ అన్యోన్యంగా ఉండేవారు.

చిన్నతనం ఆనందంగా గడిచిపోయింది. ప్రశస్తమైన యవ్వనావస్థలో ప్రవేశించాను. లోకమంతా మనోరంజకంగాను, నాలుగు ఋతువులు ఒకే ఋతువు వసంతంగాను కనిపించాయి.

అప్పటికి 'ప్రేమ' అనే శబ్దము, దాని విలువ బాగా గ్రహించాను. ఆమెకూడ నా అవస్థలోనిదే కనక ప్రేమను గ్రహించే ఉంటుందని నా ఆశ, నమ్మకము.

గ్రహించటం ఇద్దరం గ్రహించాం, కాని ఒక్కరం ప్రకటించలేదు. ఈ మౌనానికి బహుశః కారణము సిగ్గే అయిఉంటుంది. ఇద్దరివి యువక హృదయాలు. ఈ వికాసం, మదోన్మత్తత, ఈ ప్రేమ, దినదినాభివృద్ధి పొందుతూ వచ్చాయి - కాని అడపా దడపా అడ్డాలు లేకపోలేదు.

ఈ రోజున నా కనుసన్నల మెలుగుతూ ఉన్న సంఘం, అప్పుడు మా ప్రేమను మెల్లకన్నుతోనైనా చూడటానికి లక్ష్యపెట్టలేదు.

## ఇప్పుడు నేనుధనికుణ్ణి

ఒకనాడు సంధ్యవేళ విశాలమైన మైదానముమీదికి పోయి రజని నేను కూర్చున్నాము. దృశ్యము ప్రశాంతంగా ఉంది. పక్షులు పొలములనుండి యెగిరి గూళ్ళకు పోతున్నాయి. సూర్యుడుకూడ ఎఱ్ఱని అస్తాచలమును కౌగలించుకొని యెఱ్ఱబారాడు.

చాల కాలంనుంచి ఆమెకు నా ప్రేమను ప్రకటిద్దామని కోరిక ఉంది. కాని వీలు చిక్కటంలేదు! ఒకరోజున సాహసించి రజనితో, "ఎన్నాళ్లు మనము యిలా ప్రేమోన్మాదులమై ఉంటాము రజనీ?" అన్నాను.

"ఏమి ఉన్మాదం సుధాకరా?" అంది.

నేను గంభీరంగా "ఉన్మాదము, ప్రేమ, ప్రేమోన్మాదులం మనం; ఏం? అంతేకాదూ?" అన్నాను.

ఆమె "ఊఁ" అని ఊరుకుంది.

బహుకాల వాంఛితమై మరుగుపడిఉన్న కోర్కె

తీర్చుకొని ఇంటికి పొయ్యాము. ఆ పాడు భగవంతుడికి మా కలియిక నచ్చలేదు. అదే మా కడసారి కలియిక.

★

ఒక నెలరోజులవరకు నేను, ఆమెను చూడలేదు. నిత్యము ఆమె గుమ్మము దగ్గరనుంచే పోతుండేవాణ్ణి. కాని యెప్పుడు కనిపించనైనా లేదు. రజని తండ్రి నన్నుచూచి రుసరుసలాడేవాడు. ఆనెల యెలా గడిచిందో నా మనస్సుకే తెలియాలి.

ఒకరోజు ప్రొద్దున్న దంతధావనం చేస్తూన్నప్పుడు ఆమె ఇంట్లోనుండి ఏడ్పు వినిపించింది. పరిగెత్తుకువెళ్లాను. చూస్తే తలుపు తెరచిఉంది. రజనీ దీనావస్థలో ఉంది. తల్లి ఏడుస్తుంది. తండ్రి నన్నుచూడంగానే ఒక చీటి నా చేతి కందిచ్చాడు.

అందు ఇలా వ్రాయబడి ఉంది.-

"ప్రియ సుధాకరా!"

నీ చేతుల్లో ఈ ఉత్తరం చేరేలోపల నీ ప్రియతమమైన రజిని పరలోకం చేరిపోతుంది.

ఒక రోజున మేమందరమూ కూర్చుని యుండగా మా తల్లి "రజనీ! నీకు పెళ్లికాబోతుంది, మీ తండ్రిగారు ఒక నవయువకుణ్ణి, ధనికుణ్ణి చూచారు నీకు చెయ్యటానికి. సుధాకర్‌తో కలసి మెలసి తిరుగకు" అంది. నేను ఊరుకోలేక "సుధాకర్‌ను విడిచి ఉండనా! అది నా చేతగాదు." అన్నాను. ఇంతలో తండ్రిగారు అదే అవుతుంది. త్వరలో పెళ్లిచేస్తాను. చూస్తా. ఎందుకు అవదో?" అని కోపంగా అన్నారు.

"నా పెళ్లివిషయంలో జబరదస్తి చేస్తే మీ పిల్లకు నీళ్లు వదలుకోవలసి ఉంటుంది" అన్నాను.

ఆరోజునుండి నీతో కలవటానికి వీల్లేకపోయింది. నీకు దూరంగా ఉండడంకంటె ప్రపంచానికే దూరంగా ఉండటం మంచిదనిపించి మా యింట్లో రహస్యముగా ఉంచిన విషపుమందు ఒక డోసు పుచ్చుకొని ఆత్మహత్య కావించుకొన్నాను. చివర నిన్ను చూడలేకపోయానన్న దుఃఖము తప్ప మరేమిలేదు. నా చావుకు నీవు విచారమే పొందితే నా చావుకు ఉత్తరవాదియైన ఈ సంఘాన్ని, సంఘ దురాచారాలనుండి విముక్తిచెయ్యి"

ఇట్లు నీ ప్రేమ పూజారిణి

'రజని'

క్రోధావేశంచేత, విచారంచేత స్తంభితుడనైపొయ్యా! కాగితం చేతుల్లో మడిచే ఉంది. తండ్రి కేసి చూచి "రజని నీవలననే చచ్చిపోయింది. నువ్వు మనుష్యుడవు కావు, నరభక్షకుడివి. నీ సంఘోద్దేశ్యాలు, ఉద్దేశ్యాలు కావు; వాడియైన విషకత్తులు!! ఇలా ఇంకా యేమన్నానో నాకే తెలియదు.

వెంటనే బయటకు వచ్చేసి పరుగు ప్రారంభించాను. మనోవైకల్యం కలిగింది. కొంచంసేపటిలో ఒక రైలుస్టేషను చేరాను. తలవని తలంపుగా సిద్ధంగా నున్న రైలులోదూకి దాంతో వెళ్లిపొయ్యా! మగతగా నిద్రపట్టిపోయింది.

★

రైలు ఆగింది. కళ్లు తెరచిచూచా. అది కలకత్తా స్టేషను. నా భాగ్య చక్రము తిరిగింది. ఒక బంగాళీ వర్తకునివద్ద గుమస్తాగా చేరాను. మొదటి జీతంలోనుంచి 7 రూ. డెర్బిషైర్ పందెములకు వేసాను. పందెము గెలిచి 2 లక్షల రూపాయలు బహుమతివచ్చింది. కాని నాకు డబ్బు రావటంవల్ల సంతోషంలేదు. పోవటంవల్ల దుఃఖము లేదు. నా ప్రేమైకరాసి 'రజని' నన్ను వదలిపోయింది.

★

రోజూ వార్తాపత్రికల్లో మా నాన్నగారినుండి "సుధాకర్! ఎక్కడ? త్వరలో యింటికిరా! ఇంట్లో విచారిస్తున్నారు" అని ప్రకటనలు పడుతూనే ఉన్నాయి. కాని నాకు ఈ ప్రపంచములో ఎవరు అగుపించటం లేదు.

ఇప్పుడు గొప్ప ధనికుణ్ణి

యే సంఘం మా యిద్దరినీ విడతీసిందో, యే సంఘ నియమాలవల్ల బంధింపబడ్డానో ఆ బంధనాలను ఈ రోజున డబ్బు అనే వాడికత్తితో త్రెంచివేస్తున్నాను. నాస్థితిలో ఉండి, అవస్థపడుతూన్న వారందరికి సహాయం చేస్తున్నా.

ఇదే నా పశ్చాత్తాప స్వరూపము.